# కాంగ్రెస్ కడుపు మంట

- సాగుకు 3 గంటల కరెంటే చాలంటూ ప్రకటనలు
- టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అహంకారపు మాటలు
- ఎన్నికల వేళ రైతులను కించపర్చేలా వ్యాఖ్యలు
- మాటలపై రైతుల్లో కట్టలుతెంచుకున్న ఆగ్రహం
- 10హెచ్‌పీ బోరు మోటర్లు బిగిస్తే ట్రాన్స్‌ఫార్మర్లు
- కాలిపోతాయంటున్న సన్న, చిన్నకారు కర్షకులు
- విద్యుత్ కష్టాలు తెచ్చేందుకే అంటూ నిలదీత
- తిప్పకొట్టాలంటున్న కర్ణాటక రాష్ట్ర రైతులు




## 3 గంటల కరెంట్‌కు ఎకరం కూడా తడవదు..



వ్యవసాయంపై అవగాహన లేనోళ్లు మస్తు మాట్లాడుతరు. 3 గంటల కరెంట్‌తో ఎకరం పొలం కూడా తడవదు. ఇంతకూ సేద్యం చేసినోడా.. చేయనోడా మాట్లాడింది. ఎకరం పొలం తడుపడానికి 40 స్ప్రింక్లర్ పైపులు పరువాలి. పొలం తడిచే కొద్దీ వాటిని మార్చాల్సి ఉంటుంది. ఈ పైపులు మార్చుతుంటే 3 గంటల కరెంట్ గ్యారంటీగా ఉంటుందని నమ్మకం ఏంది. సన్న, చిన్న కారు రైతులు మూడు నుంచి ఐదెకరాల వరకు పొలం ఉన్నోళ్లు మాత్రం మన వద్ద వాడుతున్నది 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లే. ఈ రోజుల్లో 10 హెచ్‌పీ మోటర్ ధర మార్కెట్లో రూ.68 వేలు (సీఆర్‌ఐ టెక్సో కంపెనీ, ఓటికల్ కంపెనీ మోటర్లు) ఉన్నాయి. 15 ఎకరాలు పొలం ఉన్న రైతుకు నేనే మొన్న మంచి కంపెనీ 10 హెచ్‌పీ మోటర్‌ను ధర రూ.68 వేలకు ఇప్పించిన. వాస్తవంగా పెద్ద రైతులు 10 హెచ్‌పీ మోటర్లను ఎగువ ప్రాంత పొలాలకు నీటిని అందించేందుకు వాడుతారు. ఈ మోటర్‌తో నీటిని తోడితే ఊటంతా బయపడుతది. ఒకేసారి 10 హెచ్‌పీ మోటర్లను రైతులందరూ ఆన్‌చేస్తే ట్రాన్స్‌పార్మర్లు ఉంటాయా.. కాలిపోతయి. ఇంతకు అవగాహన ఉండి మాట్లాడింది కాదు. ఇది కేవలం రైతులను మభ్యపెట్టేందుకే పచ్చి అబద్ధం మాట్లాడిండు. 10 హెచ్‌పీ మోటర్‌కు రూ.68 వేలు, వైర్లు, పైపులు, స్ప్రింక్లర్లు, స్టార్టర్, డబ్బాకు కలిపి మరో 60 వేలు అదనంగా ఖర్చవుతుంది. ఇంత భరించి రైతులు అంత పెద్ద మోటర్లను కొనుగోలు చేసి వాడుతారా..? తెలంగాణ వచ్చినంకనే సీఎం కేసీఆర్ సారూ 24 గంటలు కరెంట్ నిరంతరం ఇస్తుండడంతో రైతులు సేద్యం చేసి ఆర్థికంగా బాగుపడ్తుండ్రు. ఇది పచ్చి నిజం. జగమెరిగిన సత్యం.ఈ మధ్యన రేవంత్‌రెడ్డి 10 హెచ్‌పీ మోటర్‌తో 3 గంటల్లోనే పొలం పారించుకోవచ్చని ఈ మధ్య ఉచిత సలహా ఇచ్చిండు. అది ఏదో ప్రయోగం చేసి చూపిస్తే రైతులు అమలు చేస్తరు కదా! ఉచిత సలహా మస్తుగిస్తరు.

**- రాము, మోటర్ వైండిండ్ మెకానిక్, కొల్లాపూర్**

## కాంగ్రెస్ ఝూటా మాటలు నమ్మం..



రైతులను మోసగించేందుకు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ రైతులకు ఇస్తున్న జూట హామీలను నమ్మం. రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంట్‌తో పొలం మొత్తం పారుతందని అంటున్నాడు. ఆయన ఎమైనా దేవుడా.. ఎట్ల సాధ్యం.. వ్యవసాయం గురించి తెలిసిన వాడు ఇట్ల మాట్లాడడు. రైతులను అవమానించేలా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నడు.. సీఎం కేసీఆర్ రైతుల కష్టాలను ఎరిగిన నేత కాబట్టి దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో రైతులకు ఉచితంగా 24 గంటల కరెంట్ ఇస్తున్నాడు. పూటకో మాట మాట్లాడే కాంగ్రెస్ నాయకుల మాటలను కరెంట్ కష్టాలను ఎరిగిన ఏ రైతు నమ్మడూ..

**- శివశంకర్‌రెడ్డి, రైతు, జటప్రోల్, పెంట్లవెల్లి మండలం**

## రైతులను ఆగం చేసేందుకు కుట్రలు



బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న 24 గంటల కరెంట్‌తో ఆనందంగా వ్యవసాయం చేసుకుంటున్నాం. ఉదయం పొలం వద్దకి వచ్చి బోరు మోటర్ ఆన్ చేసి, సాయంత్రం ఇంటికి వెళ్లేటప్పుడు మోటర్ బంద్ చేసి వెళ్తున్నాం. కాంగ్రెస్ నాయకులు వ్యవసాయంపై అర్థంపర్థం లేకుండా మాట్లాడుతున్నారు. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ సరిపోతుంది అనడం వారి అవివేకం. పొలాల వద్ద 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లనే వాడుతారు. 10 హెచ్‌పీ మోటర్‌తో రైతుకు ఖర్చు ఎక్కువ అవ్వడమే కాకుండా బోర్లు ఎండిపోవుడు ఖాయం. ఈ మోటర్లను బిగించి రైతులందరూ ఒకేసారి బోర్లు ఆన్‌చేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయి. కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం పాడైపోయింది. కరెంట్ ఎప్పుడు వచ్చేదో, ఎప్పుడు పోయేదో తెలువకపోతుండే. కాంగ్రెస్ హయాంలో రాత్రిపూట వదిలే కరెంట్‌తో అనేక ఇబ్బందులు పడ్డాం. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ అందిస్తున్న సీఎం కేసీఆర్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు

**- బాచిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కడ్తాల్ మండలం**

## 10 హెచ్‌పీ మోటర్లతో లక్షల ఖర్చు



టెన్‌హెచ్‌పీ మోటర్లతో రైతులకు లక్షల రూపాయల ఖర్చు అవుతుంది. మూడు గంటల కరెంట్ సరిపోతుందని కాంగ్రెస్ నాయకులు అనడం చూస్తే వారికి వ్యవసాయంపైన అవగాహన లేకపోవడంతోనే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. 10హెచ్‌పీ మోటర్లతో ఒక్క సారిగా లోడ్ పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి మళ్లీ పంటలు ఎండబెట్టుకునే పరిస్థితి ఏర్పడుతుంది. ఒక వేళ మోటరు కాలిపోతే పది వేల ఖర్చు అవుతుంది. 3హెచ్‌పీ, 5హెచ్‌పీ మోటర్లతోనే రైతులకు మేలు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇస్తున్న 24 గంటల కరెంట్‌తో ఇబ్బందులు లేకుండా వ్యవసాయం చేస్తున్నాం. రైతుల పక్షాన ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా ఉంటాం.

**- బొల్ల జంగయ్య, రైతు, దేవునిపడకల్**

## రైతుల బతుకు ఆగమే..



మూడు గంటల కరెంట్ అయితే రైతుల బతుకు ఆగమైతది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 24 గంటల కరెంట్ ఇవ్వడంతో రైతులు ఎంతో బాగు పడ్డారు. కాల్వల ద్వారా వచ్చిన నీళ్లు, 24 గంటల కరెంట్ రైతు బతుకుకు భరోసానిచ్చాయి. మూడు గంటల కరెంట్ సరిపోతుందని కాంగ్రెస్ వాళ్లు చెప్పడం రైతుల పట్ల చిన్న చూపు చూడడమే అవుతుంది. కాబట్టి మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలి, రైతులందరికీ 24 గంటల కరెంట్ కావాలి.

**- రెడ్డిపాకుల బాబు, రైతు, తెలకపల్లి**

## 3 గంటల కరెంట్ సరిపోదు

రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంట్ అయితేనే పొలం పారుతది అని అంటుండు. అది రైతులకు ఎలా సాధ్యం. గత ప్రభుత్వాల పాలనలో అర్ధరాత్రి 12 గంటలకు ఇంటిలోపల భార్యాపిల్లలను ఇడిచిపెట్టి పొలాల వద్ద పండుకొని కరెంట్ ఎప్పుడొస్తుందా.. బోర్లు ఎప్పుడేయాలా అని ఎదురుచూసోటోళ్లం.. కేసీఆర్ సీఎం అయ్యాక పెట్టే గుణం ఉంది కనుక రైతుల కోసం ఇంత కష్టపడుతుండ్రు. సార్ మంచి ఆలోచన చేసిండు. ఇప్పుడు పొద్దుగాల కరెంట్ వస్తే పోతనే లేదు. నాకు ఐదు ఎకరాల పొలం ఉంది. ఈ పొలానికి నీళ్లు కావాలంటే మూడు గంటల కరెంట్ ఇస్తే ఎలా సరిపోతుంది. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి మళ్లీ మోసపోము. తెలంగాణలో కేసీఆర్ పాలన చూశాక కాంగ్రెసోళ్లను మేము నమ్మం.

**- చంద్రనారాయణ, శ్రీపురం గ్రామం, నాగర్‌కర్నూల్ జిల్లా**



## 10హెచ్‌పీ మోటర్లు ఎలా పెట్టాలి



టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వాఖ్యలు చాలా దుర్మార్గం ఉన్నాయి. 5హెచ్‌పీ మోటర్లకే బోర్లల్లో నీరు లేనప్పుడు 10 హెచ్‌పీ మోటర్లు ఎలా పెట్టాలి. మోటర్లు కాల బెట్టుకొని అప్పుల పాలు కావడానికే రేవంత్‌రెడ్డి పన్నాగం పన్నినట్లుంది. ప్రస్తుతం బోర్లల్లో నీరు 3 హెచ్ పీ మోటర్లకే సరిపడడం లేదు. 24 గంటల కరెంట్ ఉంటే కవర్ గుంతలల్లో నీరు పెట్టి పోలానికి పారిస్తున్నాం. 24 గంటల కరెంట్‌తోనే రైతులకు నిజమైన న్యాయం చేకూరుతుంది. రైతులు అప్పుల పాలు కావడానికి రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారు. కాంగ్రెస్ ను నమ్ముకుంటే రైతులు ఆగం కావాల్సిందే. కాంగ్రెస్ నాయకుల కుట్రలకు రైతులు లొంగరు.

**- చలిచీమల నిరంజన్ రైతు వెల్దండ, నాగర్‌కర్నూల్ జిల్లా**

## 24 గంటల కరెంట్ కావాలి..



మాకు 24 గంటల కరెంట్ కావాలే అట్లయితేనే పంటలు పండుతయి. లేకుంటే సేద్యం ఆగమైతది. తెలంగాణ రాక మునుపు కరెంట్ సక్కగా లేక పంటలు పెద్దగా పండక పోయేది. మా ఊర్లో చిన్న రైతులు దేశాలు పోయేటోళ్లు. కానీ తెలంగాణ రాష్ట్రం వచ్చినంకా రెండు కార్ల పంటలు పండుతున్నాయి. అందుకు 24 గంటల కరెంట్, కాల్వల పొంటి వచ్చిన నీళ్లు. ఇప్పుడు రైతులంతా బాగున్నారు. అందరూ ఊర్లల్లోనే ఉంటున్నం. అందుకే మళ్లా బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలి.

**- చీర్ల ఊషన్న, రైతు, కమ్మారెడ్డిపల్లి, తెలకపల్లి**